క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు నాలుగురికి రూ. 2 వేల చొప్పున జరిమాన విధించిందని ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో నలుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి.. ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు



రసాయన ద్రావణం పిచికారీ చేస్తున్న కార్మికుడు

నారాయణఖేడ్: వర్షాలు తెరిపినివ్వడంతో దోమలు ప్రబలే అవకాశం ఉండటంతో ఖేడ్ మున్సిపల్ అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. పలు వార్డుల్లోని మురుగు ల్వాలు, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీరు, అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగునీటిలో కార్మికులతో రసాయన ద్రావణాన్ని పిచికారీ చేయించారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. మున్సిపాలిటీ వాసులు డ్రమ్ములు, కొబ్బరిబోండాలు, పాతటైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కమిషనర్ జగ్జీవన్ సూచించారు.

ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులో గల ఎస్ఎస్ ఆర్గానిక్స్, ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పీసీబీ కార్యాలయంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పరిశ్రమలు వెదజల్లే జల, వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బండల శివకుమార్, నాయకులు కుమ్మరి బాలశెట్టి, రవికుమార్ గౌడ్, అనిల్, రాజయ్య, నర్సింహులు, మహేశ్, విఠల్, జైపాల్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): వరసకు కొడలయ్యే వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కల్హేర్ ఎస్సై వెంకటేశం శుక్రవారం తెలిపారు. మండలంలోని బిబిపేటకు చెందిన వివాహిత తన భర్త మరణించడంతో ఒంటరిగా పిల్లలతో కలిసి ఉంటుంది. ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన మామ అయిన నామ హనుమంతు తలుపులు తెరచి లోపలికి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై ఇటీవల బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలలో మరుగుదొడ్లు, వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కర్మాగారం అధికారులు

జహీరాబాద్: కోహీర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు, వాటర్ ప్లాంట్ శుక్రవారం ప్రారంభించారు. కవేలి గ్రామ శివారులో గల సెంట్ గోబింద్ ఇండియా (రాక్‌వూల్) కంపెనీ యాజమాన్యం రూ.12 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొత్తగా మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వగా.. ప్రారంభోత్సవం జరుపుకొంది. ఈ సందర్భంగా కర్మాగారం డైరెక్టర్ ఫన్నీ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ, పాఠశాలలో సదుపాయం కల్పించడం పట్ల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, కర్మాగారం ప్రతినిధులు ప్రసాద్, నితిన్‌కుమార్, రమేష్, మండల నోడల్ అధికారి జాకీర్ హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జహీరాబాద్ టౌన్: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి మండలంలోని మల్‌చెల్మ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచనలు చేశారు. సొంతూరులో పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, పాఠశాల హెచ్ఎం. అనితా కాంబ్లే ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైబై గణేశా..

న్యాల్‌కల్ మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు భారీ వినాయక విగ్రహాలను వాహనాల్లో ఊరేగింపు తీసువెళ్లి మంజీర నదిలో నిమజ్జనం చేశారు.

– న్యాల్‌కల్(జహీరాబాద్):



ఆకట్టుకున్న వేషధారణ

నారాయణఖేడ్ పట్టణంలో ప్రతిష్ఠించిన పలు వినాయక విగ్రహాలను శుక్రవారం తెల్లవారుజామున కమలాపూర్ చెరువులలో నిమజ్జనం చేశారు. పట్టణంలోని నియోప్రగతి పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుణ్ణి నిష్ఠలతో పూజలు నిర్వహించారు. కాగా నిమజ్జనోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– నారాయణఖేడ్:



వినాయకుడి వేషధారణలతో విద్యార్థులు

సమాజ నిర్మాణంలో టీచర్లు కీలకం

● మంత్రి దామోదర రాజనర్సింహా



సన్మాన గ్రహీతలతో మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్రయని మంత్రి సీ దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం అందోల్ మండలం అల్మాయిపేట ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవంలో ప్రసంగించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఎంతో గురుతరమైన బాధ్యత ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో సేవాభావం చాలా ముఖ్యమైందన్నారు. పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులకు తన పిల్లలు, తన పాఠశాల అన్న భావన కలిగి ఉండాలన్నారు. తాను ఇటీవల పరిశీలించిన కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూళ్లను పరిశీలిస్తే చాలా బాధ కలిగిందన్నారు. అందుకే పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.కోటి వరకు సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు 5 డీఏలలో కనీసం 3 అయినా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేసే విషయాన్ని ప్రభుత్వ పరిశీలిస్తోందన్నారు. తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్న హయాంలో జేఎన్‌టీయూ, పాలిటెక్నిక్ కళాశాలలు, పీజీ కళాశాలలను తీసుకు వచ్చానన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా నర్సింగ్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేయించానని తెలిపారు. రాజకీయాల్లో గెలుపు, ఓటమి సహజమేనని, నాయకుడిగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ డీఏల అమలు విషయంలో చొరవ చూపాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మంత్రి సహకరం చాలా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.మాణయ్య, జిల్లా నాయకులు సాబేర్ అలీ, మదన్‌మోహన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరోత్తం, నాయకులు సుభాష్, జి.అనిల్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఓటరు జాబితా



జహీరాబాద్: బూర్దిపాడ్ పంచాయతీ కార్యాలయం వద్ద ఓటర్ జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి

జహీరాబాద్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం వార్డులవారీగా ఓటర్ లిస్టులను ప్రదర్శించారు. వార్డులవారీగా రూపొందించిన ఓటర్ లిస్టులను పంచాయతీ కార్యదర్శులు జహీరాబాద్, కోహీర్ మండలాల్లోని గ్రామ పంచాయతీల వద్ద వాటిని ప్రదర్శించారని ఎంపీడీఓలు మహేందర్‌రెడ్డి, భారతి పేర్కొన్నారు. రేపటి నుంచి వారం రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించి తుదిఓటరు జాబితాలను ఈనెల 21న ప్రదర్శిస్తామన్నారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుల్లో వార్డులవారీగా సిద్ధం చేసిన ఓటరు జాబితాను అందుబాటులో తెచ్చామని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ తెలిపా రు. రాయికోడ్‌లోని ఎంపీపీ భవనం, నాగ్వార్ గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంచిన ఓటరు జాబితాను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

కంది(సంగారెడ్డి): మండలంలో 37,312 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 18,870 పురుషులు 18,420 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో ఓటర్ జాబితాను నోటీసు బోర్డులో పెట్టినట్లు వెల్లడించారు.

కంగ్టి(నారాయణఖేడ్): ఓటరు జాబితాను ప్రచురించామని, వీటిపై ఏవైనా అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 18వ తేది తుదిగడువని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కేంద్రాల్లో ఓటర్ జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అనంతరావుకు సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది అనంతరావు కులకర్ణిని శుక్రవారం ఎస్పీ రూపేశ్ సన్మానం చేశారు. తొలుత మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి మరణ శిక్ష విధించేలా ఆయన కేసు వాదించారని ఎస్పీ రూపేశ్ గుర్తుచేశారు. ఆ మేరకు అనంతరావును తన కార్యాలయానికి ఆహ్వానించి శాలువతో సన్మానించారు. నిందితుడికి మరణ శిక్ష పడేలా కేసు వాదించడంతో ఎస్పీ అభినందించారు.



కులకర్ణినిసన్మానిస్తున్న ఎస్పీ రూపేశ్

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



కార్పొరేటర్‌తో కలిసి రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్‌లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్, శిశుమందిర్ కాలనీలలో 20 లక్షల రూపాయల అంచనాతో నిర్మించ చేపట్టిన రహదారుల పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలలో రహదారులు, అంతర్గత డ్రైనేజీల నిర్మాణ పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమి టీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేశ్, అజ్మత్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి

● అధికారులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశం



కల్హేర్: కామునిచెరువులో నీటి నిల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్హేర్‌లో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో హరితహారం కింద నాటిన మొక్కలు, నిధుల ఖర్చు వివరాలు గురించి ఆరా తీశారు. ఈజీఎస్ సిబ్బంది వద్ద వివరాలు లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తంచేశారు. చెరువుల్లో పూడికతీత పనులతో ఉపయోగం లేదని తెలిపారు. కాల్వలు బాగు చేసే పనులు చేయించాలని సూచించారు. హరితహారం కింద నాటిన మొక్కలు, ఖర్చు లెక్కలు తేల్చేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తానని స్పష్టం చేశారు. కల్హేర్ కాముని చెరువును సందర్శించారు. చెరువు కట్టపై ముళ్లపొదలు తొలగింపు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్‌బాబు, తహసీల్దార్ శివ శ్రీనివాస్, మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్‌లు మహిపాల్‌రెడ్డి, వీర్‌షెట్టి, నాయకులు మల్లోడ్డి తుకరాం, జితేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

● మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ పల్లవి

కంది(సంగారెడ్డి): వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ పల్లవి అన్నారు. శుక్రవారం కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాఠశాల పరిసరాల్లో ఉన్న గుంటలను పూడ్చి వేసి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వాటర్ ట్యాంకులను కడిగి శుభ్రం చేస్తుండాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఆహార విషయంలో కూడా శుభ్రత పాటించాలని సూచించారు. మండల వైద్యాధికారి సాయి శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే రక్త హీనత రాబోదన్నారు.



గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి పట్టణం సాయి మాణిక్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడికి శుక్రవారం 108 రకాల ప్రసాదాలను సమర్పించారు -సంగారెడ్డి జోన్

ప్లేట్లు, కుట్టుమిషన్లు పంపిణీ

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు గ్రామీణ మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రోస్ ఫౌండేషన్ పనిచేస్తోందని రోజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జర్మనీకి చెందిన ఫెల్నర్, ఇవాగార్ల అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో గతంలో వీరు అందించిన కుట్టుమిషన్ల ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి కుట్టుమిషన్‌లు అందజేశారు. అలాగే 500 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు అందజేశారు. రోజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు శేషయ్య, ఉపాధ్యక్షుడు వైవీ రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటిలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. గ్రామానికి చెందిన చెందిన బొమ్మ సుక్కమ్మ, శ్రీనివాస్ పటేల్‌తో పాటు మరో వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.1.60 లక్షలు చెక్కులను హద్నూర్ పీఏసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు అందజేశారు. బొమ్మ సుక్కమ్మ, శ్రీనివాస్ పటేల్ తదితరులు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు. తమకు ఆర్థిక సహాయం అందించాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండు కింద రూ..1.60 లక్షలు మంజూరు చేసింది. మంజూరైన రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. అశోక్, ప్రభాకర్, రాజు పటేల్ పాల్గొన్నారు.

◆ **విద్యుదాఘాతంతో ఎద్దు మృతి**

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని వెంకటాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన మహిళా రైతు మచ్కురి లక్ష్మికి సంబంధించిన ఎద్దు శుక్రవారం గ్రామ శివారులో మెతమేస్తూ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైర్‌ను తాకగా విద్యుదాఘాతంతో మృతిచెందింది. విలువ రూ.1.25 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

◆ **కల్యాణలక్ష్మి కోసం వినతి**

సంగారెడ్డి: పట్టణ, మండల పరిధిలో మంజూరైనా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు ఇవ్వాలని జన జాగతి సేన సంఘం ఆధ్వర్యంలో కోరారు. శుక్రవారం సంగారెడ్డి తహసీల్దార్ దేవదాస్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడారు. కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరై నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు.



కంగ్టి : ముందస్తుగా అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి టౌన్‌లో..



సదాశివపేట: స్టేషన్‌లో నాయకులు

బీఆర్ఎస్ నేతల ముట్టడి భగ్నం

అరికెపూడి గాంధీ ఇంటి ముట్టడికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ ముందుస్తు అరెస్టులు చేసి ముట్టడిని భగ్నం చేశారు. పలుచోట్ల పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం నేతలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా నేతలు అతనికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఆపార్టీ నాయకులు చేసిన దాడికి పాల్పడటం సరికాదన్నారు.



పటాన్‌చెరు టౌన్‌లో...

● లక్ష్మీ గణపతిగా..

పట్టణ శివారులోని వాసవి మాత దేవాలయంలో గణనాథుడు లక్ష్మీ గణపతి రూపంలో దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. –సంగారెడ్డి టౌన్



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ గణపతి

● రుద్రేశ్వరుడిగా..

రుద్రేశ్వరుడిగా గణనాథుడు దర్శనం ఇచ్చాడు. పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్ గడ్డ దేవాలయంలో కొలువై ఉన్న గణేశుని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రుద్రాక్షలతో అలంకరించారు. ఆపై అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ఆవరణంలో నిత్య అన్నదాన కొనసాగుతుందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ. శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌లు తెలిపారు.

– పటాన్‌చెరు టౌన్:



రుద్రేశ్వరుడి అలంకరణలో గణనాథుడు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400